# వర్గీకరణ అటకెక్కినట్టేనా?


**కె.బాలగోపాల్**

చట్ట సభలలో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రతిపాదన గురించి ఒక అభిప్రాయం చాలా కాలం కిందే స్థిరపడిపోయింది. అది జరగవలసిందేనని అందరూ అంటారు గానీ ఎప్పటికీ జరగదు. ఇప్పుడు ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ అదే కోవకు చెందిన విషయమా అన్న సందేహం వస్తున్నది. అది న్యాయమైన డిమాండని అందరూ (అతికొద్ది మినహాయింపులతో) ఒప్పుకుంటారు. కానీ అది జరగదనుకోవాలా?

దళితులలో అంతర్గతంగా అసమానతలున్నాయన్న విషయాన్ని ఎవరూ కాదనడం లేదు. సాంఘికమైన ఈ అసమానత విద్యా ఉద్యోగరంగాలలో దళితులకు ఉమ్మడిగా ఇచ్చిన రిజర్వేషన్లను అనుభవించే విషయంలోనూ అసమానతకు దారితీసిందని ఇప్పటికి రెండు న్యాయ విచారణ కమిషన్లు నిర్ధారించాయి. జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ మొదట నిర్ధారించింది. ఆ నివేదిక ఆధారంగా అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎబిసిడి వర్గీకరణ చట్టాన్ని గురించి హైకోర్టులోనూ సుప్రీంకోర్టులోనూ జరిగిన వాదోపవాదాలలో ఈ నిర్ధారణ తప్పని ఎవ్వరూ వాదించే ప్రయత్నం చేయలేదు. అది నిజమే అయినప్పటికీ ప్రభుత్వం వర్గీకరణ చేయవచ్చునా అన్నదే న్యాయస్థానాలలో జరిగిన వాదన. సుప్రీం కోర్టయితే 'జస్టిస్ రాజు కమిషన్ నివేదికలోని నిజానిజాల జోలికి మేము పోవడం లేదు' అని ప్రకటించి మరీ రాష్ట్ర ప్రభుత్వ చట్టాన్ని కొట్టేసింది. దళితులలో ఆంతరంగిక అసమానత ఉంటే ఉండవచ్చును గానీ దాని గురించి ఏమీ చేయడానికి వీలులేదని అయిదు గురు సుప్రీంకోర్టు జడ్జీలు తేల్చారు.

ఈ తీర్పు రాజ్యాంగానికే మచ్చ. అసమానతనూ అన్యాయాన్నీ గుర్తించిన తరువాత ఏమీ చేయడానికి వీలులేదనీ, చేస్తే రాజ్యాంగం ఒప్పుకోదనీ అనడం భారత రాజ్యాంగం మీద అన్యాయమైన నింద. అసమానతలను అధిగమించడానికి సామాజిక ఆర్థిక అవరోధాలు అనేకం ఉన్నాయనేది వాస్తవం. వాటినన్నింటినీ అధిగమించడానికి కావలసిన రాజకీయ సాధనాలు రాజ్యాంగం ఇవ్వలేదంటేనూ వాస్తవం. కానీ రాజకీయ సంకల్పం అంటూ ఏర్పడిన తరువాత కూడ రాజ్యాంగం అడ్డం అనేది అర్థరహితమైన వ్యాఖ్య. సుప్రీం కోర్టే చేయవచ్చును గాక, అది అర్థరహిత మైన వ్యాఖ్యే. ఒక్క జాతుల స్వయం నిర్ణయాధికారం మాత్రమే దీనికి మినహాయింపు. ఒక జాతి విషయంలో వారి స్వాతంత్ర్య కాంక్ష న్యాయమైనదని అన్ని రాజకీయ శక్తులూ అంగీకరించినా కూడ రాజ్యాంగం ఒప్పుకోదు. దీనికి వేరే మినహాయింపులు లేవు.

ఏమైతేనేం, తప్పో ఒప్పో సుప్రీంకోర్టు చెప్పిన తరువాత రాజ్యాంగాన్ని సవరించడం తప్ప వేరే ఏ మార్గం లేదు కాబట్టి దేశ పాలకులు నిజంగానే దళితులందరికీ సమాన న్యాయం చేయదలచుకుంటే రాజ్యాంగాన్ని సవరించవలసింది. ఏమని సవరించాలో ఎవరయినా చెప్పగలరు. దానికొక న్యాయవిచారణ కమిషన్ అక్కర లేదు. 'ఎస్సిలకు గానీ ఎస్టిలకు గానీ ఇచ్చిన రిజర్వేషన్లు, లేక ప్రత్యేక సదుపాయాలు, వారిలోని ఉపకులాల మధ్య సమన్యాయం సాధించడానికి హేతుబద్ధంగా పంపిణీ చేసే అధికారం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఉంది' అన్న వాక్యాన్ని రాజ్యాంగంలోని ఆరికల్ 341లో మూడవ క్లాజుగా చేరిస్తే సరిపోతుంది.



ఈ సలహా ఇవ్వడానికి న్యాయ విచారణ కమిషన్ ఆవశ్యకత లేకపోయి నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ మార్గాన్నే ఎంచుకుంది. సుప్రీం కోర్టు తీర్పుతో కాగల కార్యం గంధర్వులు తీర్చారని ఊపిరి పీల్చుకున్నారేమో, ఎం ఆర్ పి ఎస్ ఆందోళన పెంచేసరికి ఏదో ఒకటి చేసినట్టు కనబడాలని భావించి ఈ పని చేశారు. జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ ఈ విధంగా పుట్టింది. నిజానికి ఎవరూ గమనించినట్టు లేదు గానీ, ఎస్సి ఎస్టిలకు ఇచ్చిన రిజర్వేషన్ను వారిలో అందరూ సమానంగా అందుకున్నారా అని చూడడానికి ఒక కమిషన్ వేయడం సహితం రాజ్యాంగ విరుద్ధం అన్న వ్యాఖ్య సుప్రీంకోర్టు తీర్పులో ఉంది. జస్టిస్ ఉషా మెహ్రా సహితం – ఆ తీర్పును క్షుణ్ణంగానే చదివినప్పటికీ– ఈ వ్యాఖ్యను గమనించినట్టు లేరు. రామచంద్రరాజు కమిషన్ నివేదిక చేసిన నిజ నిర్ధారణను ఎవరూ కాదనలేదు కాబట్టి ఆమె కొత్తగా నిజ నిర్ధారణ చేయవలసి ఉండలేదు గానీ మళ్లీ గణాంకాలు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రాబట్టి లెక్కలు తీశారు. అదే నిర్ధారణకు మళ్లీ వచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఏర్పడిన సమస్యను అధిగమించడానికి రాజ్యాంగ సవరణను సూచించారు. అయితే వారు చేసిన సూచన అంత వాంఛనీయం కాదు. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్లమెంటుకు పంపినట్టయితే పార్లమెంటు వర్గీకరణ చేపట్టవచ్చునని ఆర్టికల్ 341 కి క్లాజు 3 చేర్చాలని ఉషామెహ్రా కమిషన్ సూచన.

'ఏకగ్రీవంగా' ఎందుకుండాలి? ఏ ఒక్కరైనా కాకుండ చేసే అవకాశం ఎందుకియ్యాలి? అసెంబ్లీ నిర్ణయించి పార్లమెంటుకెందుకు పంపించాలి? తానే ఎందుకు చేయకూడదు? ఒక సామాజికవర్గం వెనుకబడి ఉందని గుర్తించిన తరువాత వారికి రిజర్వేషన్లు కానీ వేరే ఏదయినా రూపంలో ప్రత్యేక అవకాశాలు లేక హక్కులు గానీ కల్పించడానికి పార్లమెంటుకు, అసెంబ్లీకే కాదు, స్థానిక సంస్థలకు సహితం అధికారం ఉందనీ, దానికి చట్టం చేయనక్కర లేదనీ, ఆదేశం జారీ చేసినా చాలుననీ రాజ్యాంగం రాసిన నాటి నుంచి న్యాయస్థానాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇచ్చిన రిజర్వేషన్ను న్యాయబద్ధంగా పంచడానికి అంతకంటే క్లిష్టమైన పద్ధతి ఎందుకు పాటించాలి?

అసంతృప్తికరమైన ఉషా మెహ్రా కమిషన్ సూచన సహితం అమలయ్యే దాఖలాలు లేవు. 'తేనెతుట్టెను కదిలించ వద్దు' అని జాతీయ ఎస్సి కమిషన్ అనిందని వార్తలొచ్చాయి. ఏమీ చేయకుండ ఉండడానికిది ప్రభుత్వానికొక చక్కని బహానా కాగలదు. ఎస్సిలకు సంబంధించిన విధాన పరమైన విషయాలలో ప్రభుత్వం ఎస్సి కమిషన్ను తప్పనిసరిగా సంప్రదించాలని రాజ్యాంగం చెబుతుంది. సంప్రదింపు అంటే సమ్మతి కాదని వాదించవచ్చునుగానీ ఈ సాకు చాలు ప్రభుత్వం చాటు చేసుకోవడానికి. వాస్తవమేమిటంటే ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలలోనూ ఎస్సిలలో, ఎస్టిలలో సాంఘిక, చారిత్రక కారణాల వల్ల కొన్ని కులాలు, తెగలు కొంచెం ముందున్నాయి. చట్టాలు ఇచ్చిన అవకాశాలను వారే ఎక్కువగా పొందగలుగుతున్నారు. దీనిని చారిత్రకంగా, సామాజికంగా అర్థం చేసుకున్నట్టయితే ఇందులో కుట్రల కోసం, కుతంత్రాల కోసం వెతకనక్కర లేదు. ఎటొచ్చీ ఈ అసమానతను సవరించే ప్రయత్నాన్ని అడ్డుకునే కొద్దీ దానివల్ల నష్టపోయినవారి కళ్లకు కుట్రలు, స్వార్థమే కనిపిస్తాయి. అది అవాంఛనీయమైన విద్వేష వాతావరణానికి దారితీస్తుంది. కానీ అన్ని రాజకీయ పార్టీలలోనూ ఆయా రాష్ట్రాల దళిత, ఆదివాసీ కులాలు, తెగలలో కొంచెం ముందున్న వారే ఆ వర్గాల నాయకులుగా, ప్రతినిధులుగా ఉన్నారు. పాలనా యంత్రాంగంలోని నిర్ణయాత్మకమైన స్థానాలలో దళితులు, ఆదివాసులు ఉన్నట్టయితే వారే ఉన్నారు. అందువల్ల రాజకీయ వ్యవస్థ కళ్లకు, పాలనా యంత్రాంగం కళ్లకు ఈ అసమానతను సవరించే ప్రయత్నం 'తేనెతుట్టెను కదిలించడం' గా కనిపించడం సహజం. కానీ అది ప్రామాణికం కావడానికి వీలులేదు.

> **అణగారిన వర్గాలలోని అంతర్గత వైరుధ్యం దీర్ఘకాలం నానుతూ ఉండడం వారి పురోగమనానికీ సమాజ పురోగమనానికీ నష్టకరం. ఈ విషయంలో ప్రధాన బాధ్యత సాపేక్షంగా ఎక్కువ ప్రయోజనం పొందిన వారిపైనే ఉంటుంది. మాల కులస్తులలో న్యాయబద్ధంగా ఆలోచించే వాళ్లు చాలా మంది ఉన్నప్పటికీ సమన్యాయాన్ని ఎప్పటికీ జరగనివ్వం అనే వారివే పెద్ద గొంతులయ్యాయి. సమస్య పరిష్కారానికి ఇదే ప్రధాన అవాంతరం అని గుర్తించక పోతే మహిళా రిజర్వేషన్ లాగ న్యాయబద్ధమైన వర్గీకరణ కూడ శాశ్వతంగా అటకెక్కికూర్చునే ప్రమాదం ఉంది.**

ఇది కేవలం ఆంధ్రప్రదేశ్కు చెందిన సమస్య అయినట్టు, అందులోనూ మాదిగ కులస్తుల సమస్య మాత్రమే అయినట్టు, ఎం ఆర్ పి ఎస్ మాత్రమే ఆందోళన చేసే పరిస్థితి ఉండడం దురదృష్టకరం. ప్రత్యేకించి మన రాష్ట్రంలోని అడవి ప్రాంత ఆదివాసులలో ఎస్టి రిజర్వేషన్ ఫలితాలు అధికంగా మైదాన ప్రాంతంలో ఉనికి ఉన్న తెగలే తీసుకుంటుండడం పట్ల చాలా అసంతృప్తి ఉంది. అయినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు ఎస్సిలతో సమానంగా ఎస్టిలకూ వర్తిస్తుందని తెలియకనో, లేకపోతే 'వాళ్లకొచ్చినప్పుడు మాకూ వస్తుందిలెమ్మ'న్న ఉదాసీన వైఖరివల్లనో ఆదివాసీ సంఘాలు చోద్యం చూస్తూ కూర్చున్నాయి.

అణగారిన వర్గాలలోని అంతర్గత వైరుధ్యం దీర్ఘకాలం నానుతూ ఉండడం వారి పురోగమనానికీ సమాజ పురోగమనానికీ నష్టకరం అనేది అందరూ గుర్తిస్తున్న సత్యం. కానీ ఈ విషయంలో ప్రధాన బాధ్యత సాపేక్షంగా ఎక్కువ ప్రయోజనం పొందిన వారిపైననే ఉంటుంది. దురదృష్టవశాత్తు మాల కులస్తులలో న్యాయబద్ధంగా ఆలోచించే వాళ్లు చాలా మంది ఉన్నప్పటికీ సమన్యాయాన్ని ఎప్పటికీ జరగనివ్వం అనే వారివే పెద్ద గొంతులయ్యాయి. అనంతంగా రగులుతూ ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ఇదే ప్రధాన అవాంతరం అని గుర్తించక పోతే మహిళా రిజర్వేషన్ లాగ న్యాయబద్ధమైన వర్గీకరణ కూడ శాశ్వతంగా అటకెక్కి కూర్చుని మూడు ధర్నాలు ఆరు రాస్తారోకోల వార్షిక తంతుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.